ప్రియదత్త - 04-09-2002

# అర్హత

"ప్రజలారా, కారంచేడు నివాసులారా! నైతిక విలువల్ని సమూలంగా నాశనం చేసి, రాజకీయ నాయకులు తమ ఏహ్యమైన పరిపాలనతో దేశాన్ని ఎంతగా దిగజారుస్తున్నారో మీరందరూ చూస్తూనే ఉన్నారు. అందుకనే ఈసారి మా పార్టీ అత్యున్నతమైన ఆశయాలు గల వ్యక్తుల్నీ, విద్యాధికుల్నీ, సంఘంలో పేరుప్రతిష్ఠలుండి మచ్చలేని వ్యక్తుల్నీ అభ్యర్థులుగా నిలబెడ్తోంది. మన కారంచేడుకి సంబంధించినంతవరకూ ఎవర్ని అభ్యర్థిగా నిలబెట్టాలో అర నిముషంలో తేలిపోయింది!

"కారంచేడు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సుందరం మాష్టారు మీ కందరికీ తెలుసు. తాతతండ్రులు సంపాదించిన లక్షలాది ఆస్తిపాస్తుల్లో వాటా తీసుకోకుండా, అవన్నీ అన్నదమ్ములకీ, అక్కచెల్లెళ్లకూ వదిలేసి, స్వయంశక్తితో సంపాదిస్తున్న నాలుగు జీతంరాళ్ళతో జీవితాన్ని అత్యంత సంతృప్తికరంగా గడుపుతున్న నిస్వార్థజీవి! ప్రేమించిన యువతి బలీయమైన పరిస్థితుల్లో మరో ఇంటి ఇల్లాలు కావడంతో, అజన్మ బ్రహ్మచారిగా ఉండిపోవడం ఆయన గుణశీలతకి

నిదర్శనం. ఎందరో మంచి విద్యార్థులాయన దగ్గర విద్య నభ్యసించి పై చదువులు చదివి, మంచి ఉద్యోగాలు సంపాదించి మన కారంచేడు గౌరవాన్ని పెంపొందించారు. ఆయన దళిత ప్రజల మధ్యకు వెళ్ళి, ప్రత్యేకంగా నిరక్షరాస్యులకి విద్యాబోధన చేసి వారి మన్ననలకు పాత్రులయ్యారు. ఇటువంటి త్యాగశీలి, నిస్వార్థజీవి, గుణధనుడూ అయిన సుందరం మాష్టారికి మీ ఓట్లు వేసి ప్రత్యేకంగా ఆయన్ని, తద్వారా మా పార్టీని ఎన్నికల్లో నెగ్గించవలసిందిగా అర్థిస్తున్నాను"

సాంబశివం మైకు ముందర నిల్చుని, ఎలుగెత్తి కావించిన ప్రసంగాన్ని విన్న జనులు హర్షనాదాలూ, జయజయ ధ్వనులూ చేశారు.

ఎన్నికలు జరిగాయి. ఫలితాలు ప్రకటించారు. ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి మీసాల కోదండ రామయ్య గారు చాలా చాలా ఓట్ల మెజారిటీతో నెగ్గారు! సుందరం మాష్టారు తమ అపజయాన్ని చిరునవ్వుతో స్వీకరించి, అధ్యాపకవృత్తిలో మునిగిపోయారు.

మాష్టారు అపజయాన్ని కొందరు తేలికగా తీసుకోలేకపోయారు. సంగతంతా వివరించి ప్రణయ్ రాయ్‌నీ, వినోద్ దువానీని విశ్లేషణ కోసం అడిగితే బావుంటుందని కొంతమంది సూచించారు.

ఫలితాలు ప్రకటించిన సమయంలో, రాష్ట్ర రాజధానిలో పనిచేస్తున్న ఓ కారంచేడు యువకుడు సెలవు మీద ఇంటికొచ్చాడు. వీళ్ళ మాటలు విని, "మీరు విశ్లేషణ కోసం ఎక్కడికో పరుగులు పెట్టనక్కర్లేదు! నేచెప్తా వినండి!" అన్నాడు.

వాళ్ళు సరేనన్నారు.

"మీరు మీసాల కోదండరామయ్యగారి ఎన్నికల ప్రసంగాల్ని సరిగా విని ఉండరు! మన ఊళ్ళోని జనాలు వాళ్ళంతట వాళ్ళే ఆలోచించి ఓట్లు వేసినా, ఊరి పెద్దల మాట విని ఓట్లు వేసినా, లేదా గుంపు నాయకుల ఆజ్ఞ మేరకు ఓట్లు వేసినా చాలా తెలివైనపని చేసి కోదండరామయ్యగార్ని గెలిపించారు.

"ఎందుకంటే త్యాగబుద్ధితో నిస్వార్థంగా తనకి రావల్సిన ఆస్తిపాస్తుల్ని వదులుకున్న పెద్ద మనిషి, కారంచేడు కివ్వవలసిన కాలేజీని పక్క ఊరు మోరంపూడి కిచ్చేస్తాడు! తాలూకాకి రావాల్సిన సిమెంట్ ఫ్యాక్టరీ పక్క తాలూకా తన్నుకుపోతుంది! జిల్లాలో పెట్టవలసిన కేంద్ర ప్రభుత్వ ఆఫీసు మరో జిల్లాకి పోతుంది! నదీజలాల విషయం పంపిణీలో రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంది! కాశ్మీరు చెయ్యిజారి పోతుంది!

"అదీకాక ఓట్లు వేసి నెగ్గించిన నియోజకవర్గంలోని జనులూ, పార్టీ మనుషులూ వ్యక్తిగతమైన, సంఘపరమైన ప్రయోజనాల్ని ఆశించి ఒత్తిళ్ళకి గురిచేస్తారు. అందుకని అంతో ఇంతో స్వార్థమున్న వ్యక్తుల్ని ఎన్నికల్లో నిలబెట్టలేకపోతే ధర్మశీలులైన నాయకులు తమ జనులకీ, ప్రాంతాలకీ, దేశానికీ ఏవిధమైన మేలూ చేయలేరు! కనుకనే సుందరం మాష్టారు లాంటి వ్యక్తులు ఎన్నికల్లో...."

నెగ్గలేరనాలా? నెగ్గకూడదనాలా?